క్లుప్తంగా

పుష్పాలంకరణలో కాలభైరవ స్వామి



నగరి: స్థానిక కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామి సన్నిధిలో సోమవారం విశేష అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేక అర్చనలు జరిగాయి. పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విభూది, పన్నీరు, కొబ్బరినీళ్ల మొదలగు వాటితో స్వామివారికి అభిషేకం చేసిన అనంతరం పుష్పాలంకారణ చేపట్టారు. భక్తులను అమితంగా ఆకర్షించింది. పూజలో పాల్గొన్న భక్తులందరికీ, ఆలయ నిర్వాహకులు పుష్పాలు, పసుపు, విభూదిని ప్రసాదంగా అందజేశారు.

అరుణగిరిపై అభిషేక పూజలు



అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామివారికి పూజలు చేశారు.

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు: గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్డీసీ కాలనీకి చెందిన మునిరత్నం తల్లి దేశమ్మ జ్ఞాపకార్థం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

దివ్యాంగుడికి సన్మానం



దివ్యాంగుడు పెరుమాల్‌రెడ్డిని సన్మానిస్తున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: నియోజకవర్గంలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మమేకమవుతున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, తండ్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. సోమవారం మండలంలో పర్యటిస్తున్న జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తకు కృపాలక్ష్మిని కలిసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర దివ్యాంగుల ప్రధాన కార్యదర్శి పెరుమాల్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభిమానం చాటుకున్నాడు. అనంతరం ఆమె కూడా దివ్యాంగుడైన పెరుమాల్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు.

టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్లపై శ్రీపద్మావతీ బాలికోన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధ్యయన కేంద్రం అసోసియేట్ డాక్టర్ కోన ప్రభ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, హత్యలు పెరిగిపోతూ ఉండడం బాధాకరమని తెలిపారు. మహిళా రక్షణకు ఉన్న టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ యాప్స్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. బాలికలు, మహిళలు అకస్మాత్తుగా ఇబ్బందుల్లో పడినా, ప్రమాదంలో ఉన్నామని భావించినా, వెంటనే 100, 112, 181, 139 వంటి టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా, అలాగే ఏపీ పోలీస్ సేవా, దిశా వంటి యాప్‌లను వినియోగించాలని తెలిపా రు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయినులు, అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఇంద్రాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతి అభివృద్ధి పని ప్రజల కోసమే

- జగనన్న సమావేశ మందిరానికి భూమిపూజ
- రూ.23 లక్షల నిధులతో భవన నిర్మాణం
- త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం
- కొత్తఆరూరులో రూ.55 లక్షలతో పాఠశాల భవనం నిర్మాణం
- ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్‌కే రోజా



భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్కేరోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ప్రతి అభివృద్ధి పని కూడా ప్రజల సౌకర్యార్థమే చేపడుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాపురం ఎస్టీ కాలనీలో రూ.23 లక్షల నిధులతో నిర్మించనున్న జగనన్న సమావేశ మందిరానికి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయలేక చేతులెత్తేస్తే ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. సామాజిక పరమైన అవసరాలను అందుబాటులోకి తేవడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఇందులో భాగంగా జగనన్న సమావేశ మందిరాలు నిర్మించడం జరుగుతోందని ఆమె తెలిపారు. కాలనీవాసులు ఈ సమావేశ మందిరాల్లో ఎలాంటి రుసుము లేకుండా ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకోవచ్చన్నారు. వర్షాకాలంలో ఈ సమావేశ మందిరాలు విడిదిగా ఉపయోగపడతాయని తెలిపారు. నేత్ర ప్రదాయణి దేశమ్మ ఆలయంలో నిర్మించిన సమావేశమందిరం, కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయ సమీపంలో నిర్మించిన సమావేశ మందిరం నేడు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మోహన్, నాయకులు మధు, మహేష్, నాగరాజు, రాందాసు, సుందరం, బాలాజీ, మదు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో చరిత్రాత్మక అధ్యాయం

నింద్ర: ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగనన్న విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇంతలా చేయలేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన క్రీడలశాఖ మంత్రి రోజా అన్నారు. సోమవారం ఆమె మండలంలోని కొత్త ఆరూరులో రూ.55 లక్షల నిధులతో నిర్మించిన ఉన్నత పాఠశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో శిథిలావస్థకు లోనైన స్కూళ్లను నేడు కళకళలాడుతున్నాయని అన్నారు. మోడల్ టేబుల్స్, ట్యాబ్స్ అంటూ విద్యాప్రమాణాలు పెరిగిందన్నారు. విద్యకు ఏ ముఖ్యమంత్రి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా, ఇప్పటి వరకు చూడని విధంగా విద్యారంగం అభివృద్ధి జరిగిందన్నారు. నాడు–నేడు పథకంలో పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి మారిందన్నారు. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు లాంటి సౌకర్యాలు ఉండేవి కావన్నారు. నేడు విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు అన్ని సౌకర్యాలతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో నింద్ర మండలానికి చెందిన విద్యార్థులు నగరి–పుత్తూరు వెళ్లి జూనియర్ కళాశాలకు విద్య అభ్యసించేవారని, ఇప్పుడు నింద్ర, విజయపురం మండలాల్లోనే జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోనే పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలకు కొత్త భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. గతంలో పీజీ, పీహెచ్‌డీలు చేయాలంటే తిరుపతి వెళ్లాల్సి వచ్చేదని, నేడు నగరి డిగ్రీ కళాశాలలోనే పీజీ, పీహెచ్‌డీ చదువుకోవచ్చని తెలిపారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

విద్యార్థుల భవిష్యత్ కోసమే..

విద్యార్థులకు సొంత మేనమామలా జగనన్న సౌకర్యాలు సమకూర్చి ఇస్తున్నారని మంత్రి రోజా తెలిపారు. ఇది ఓట్ల కోసం చేయట్లేదని, విద్యార్థుల భవిత కోసం చేస్తున్న మహత్తర కార్యక్రమం అని అన్నారు. అలాంటి వ్యక్తి కలకాలం ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ భవానీ, సర్పంచ్ కేశవులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా కార్యదర్శి మేరీ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీలు రమ్య, విజేష్, మండల కన్వీనర్ వేణురాజు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, రమేష్, రామచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులతో స్నేహభావంతో మెలగాలి



పాలసముద్రం: మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రభావతిదేవి

పాలసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల స్నేహభావంతో మెలిగి వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. సోమవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా టీకాల అధికారి డాక్టర్ రవి రాజుతో కలసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులు, వలస కూలీలను విధిగా గుర్తించి పల్స్‌పోలియో చుక్కలు వేయాలన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి 0–5 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అదే గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడ దెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్ఓ వెంట జా యింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, టీబీ లెప్రసీ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డెప్యూటీ డీఈఎంఓ డాక్టర్ జయరాముడు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్ట ర్ మోహన్‌కృష్ణ పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జేడీ

శ్రీరంగరాజపురం: శ్రీరంగరాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ దయాసాగర్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన వైద్యం చేయాలన్నారు. రోగులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందుతున్నాయా ? మందులు పంపిణీ చేస్తున్నారా ? అంటూ వాకబు చేశారు. వసతులపై ఆరా తీశారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మండలంలో జరిగిన పల్స్ పోలియోపై సమీక్ష చేశారు. ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేసి అంగవైకల్యం రాకుండా నివారించాలని సూచించారు. వలస కార్మికుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరినీ గుర్తించి వైద్య సేవలందించడంతో పాటు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. చివరిగా మందుల పంపిణీ, స్టాకు, పోలియో చుక్కలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రభావతి, వైద్యాధికారి గిరిధర్ రెడ్డి, సూపర్‌వైజర్ గంగాదేవి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛను అందజేత



దయాలసిస్ పేషెంట్ హనుమంతశెట్టికి పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్ సుధీర్



సీఎంసీలో చికిత్స పొందుతున్న గోవిందయ్యకు పింఛను అందజేస్తున్న వలంటర్ రూప

గంగాధర నెల్లూరు: మండలకేంద్రం జీడీ నెల్లూరుకు చెందిన హనుమంత శెట్టి డయాలసిస్ పేషెంట్ కావడంతో తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదును వలంటీర్ సుధీర్ తన సొంత ఖర్చులతో వెళ్లి రూ.10,000 అందించారు.

సీఎంసీకి వెళ్లి..

గంగాధరనెల్లూరు పంచాయతీ సీఆర్ కండిగ గ్రామానికి చెందిన వి.గోవిందయ్య అనారోగ్యం కారణంగా చీలాపల్లి సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ ఎం.రూప తన సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. దీంతో గోవిందయ్య ఆనందం వ్యక్తం చేశాడు.

అంకాలజీలో బ్రాకీ థెరపీ



డాక్టర్ డీఎన్ శర్మను గోల్డ్ మెడల్‌తో సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: క్యాన్సర్ చికిత్సలో బ్రాకీ థెరపీ విధానం రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని న్యూఢిల్లీ ఎయిమ్స్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ డీఎన్ శర్మ పేర్కొన్నారు స్విమ్స్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆరో వార్షిక చైర్ ఓరియేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డీఎన్ శర్మ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. క్యాన్సర్ కణితిపై నేరుగా రేడియోధార్మిక పదార్థాన్ని ఉపయోగించేందుకు బ్రాకీ థెరపీ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఓరియేషన్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆధునిక పద్ధతులను వైద్య విద్యార్థులకు అందించాలన్న సంకల్పంతో తరచూ ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అపర్ణ ఆర్ బిట్ల, డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ బీవీ సుబ్రమణియన్, డాక్టర్ ప్రాణబంధు దాస్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1.9 కోట్లు పట్టివేత

కార్వేటినగరం: కార్వేటినగరం సమీపంలోని బంగారమ్మ ఆలయం వద్ద సోమవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడు నుంచి పళ్లిపట్టు మీదుగా పుత్తూరుకు వెళ్తున్న స్కార్పియో కారులో రూ.1.9 కోట్ల పట్టుబడింది. పోలీసులు నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు డబ్బు తరలిస్తున్న సుధాకర్ వారి కుటుంబ సభ్యులను విచారించారు. తమిళనాడులోని ఆర్కేపేట వద్ద తమ సొంత భూమిని విక్రయించి నగదును తీసుకొస్తున్నట్లు పోలీసులకు వివరించారు. అయితే వాటికి సంబంధించిన రికార్డులను చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు సమాచారం.

త్వరగా గుర్తిస్తేనే పరిష్కారం



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

తిరుపతి కల్చరల్: వినికిడి సమస్యను త్వరగా గుర్తించి సరైన వైద్య సలహాలు, చికిత్స ద్వారా పరిష్కరించుకోవచ్చని అడియాలజిస్టు డాక్టర్ పి.గోపినాథ్ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో సోమవారం వినికిడిపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వినికిడి చాల ముఖ్యమని, ఆ సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక శబ్దాలు వినడం, శబ్దకాలుష్యం, ఎక్కువ సమయం మొబైల్‌ఫోన్లలో మాట్లాడడం వంటి వాటి కారణంగా వినికిడి సమస్య రావచ్చని తెలిపారు. పుట్టిన పిల్లల్లో వినికిడి లోపం ఉంటే మాటలు రావన్నారు. దీన్ని ముందస్తుగా గుర్తించి వైద్యుల సలహాల ద్వారా డిజిటల్ ప్రోగ్రామబుల్ హియరింగ్ ఎయిడ్స్ ద్వారా, కాక్లియార్ ఇంప్లాంటేషన్ వంటి సర్జరీల ద్వారా వినికిడిని తిరిగి పొందవచ్చని తెలిపారు. మంగళవారం కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సెంటర్‌లో ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9849085342ను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి గుడిమల్లం బ్రహ్మోత్సవాలు

ఏర్పేడు: మండలంలోని పురాతన గుడిమల్లం శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు భక్తుల కోసం ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి విస్తృత ఏర్పాట్లు చేశారు. సోమవారం ఏర్పాట్లను తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజు, ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు పరిశీలించారు. క్యూలు, చలువ పందిళ్లు, వాహనాల పార్కింగ్, భద్రత, భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ తదితర అంశాలపై ఆలయ చైర్మన్, ఈఓతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, నాయకులు దినేష్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్‌కే సెల్వమణి

నగరి : మండలంలోని మేళపట్టు గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణాలను మంత్రి భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పరిశీలించారు. ఈ ప్రాంతంలో 80 నివాసాలు నిర్మాణంలో ఉండగా అన్నీ పూర్తయి గృహప్రవేశాలు చేసే దశకు చేరాయి. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంత ఇంటి యజమానులు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శనం నాయుడు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈవీ బాలకృష్ణన్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వెదురుకుప్పం: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో రాజకీయ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మనుషుల మనోభావాలు దెబ్బతినేలా ప్రసంగాలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టడం వంటివి చేయకూడదన్నారు. ఎన్నికల నియమావళికి లోబడే ప్రతిఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. అనుమతి లేకుండా జల్లికట్టు వంటి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, ఎంపీటీసీ మునిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్ చొక్కా గోవిందయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రోశిరెడ్డి, నాయకులు జగదీశ్‌రెడ్డి, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సురుటుపల్లి బ్రహ్మోత్సవాలకు రండి





టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డిని, డిప్యూటి సీఎం నారాయణస్వామిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి

నాగలాపురం: సురుటుపల్లిలోని ప్రసిద్ధ శ్రీపళ్లికొండేశ్వరస్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ట్రస్టు బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు ఆహ్వానించారు. సోమవారం తిరుపతిలోని వారి స్వగృహాలకు దేవస్థానం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యుడు ఆనందయ్య వెళ్లారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ అర్చకులు సతీష్ శర్మ వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందించారు. సురుటుపల్లి బ్రహ్మోత్సవాలకు ఏటా టీటీడీ తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా సమర్పిస్తామని కరుణాకరరెడ్డి తెలిపారు.

మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల



మహా శివరాత్రి పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: వడమాలపేట మండలంలోని సదాశివ కోనలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్లను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విడుదల చేశారు. సోమవారం నగరి మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సదాశివ కోనలో వెలసిన శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మహా శివరాత్రికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.